# హామీలిచ్చేయ్! అటెన్క చూద్దాం!



- ఇదీ తెలంగాణలో పార్టీల తీరు
- ఎడాపెడా హామీల వర్షం
- రాష్ట్ర బడ్జెట్ సైజ్ రూ. 3.5లక్షల కోట్లకు మించితేనే ఇవన్నీ సాధ్యం
- రాబడులు రూ. 1.40లక్షల కోట్లకు మించని వైనం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ** : హామీలేవైనా ఇద్దాం...అధికారంలోకి వచ్చేద్దాం అన్నట్లుగా తెలంగాణలో రాజకీయ పార్టీలు ఎడాపెడా హామీల వర్షం కురిపిస్తున్నాయి. ఇందులో సంక్షేమ రంగంపై ఎక్కువ హామీలనిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలను అన్ని పార్టీలూ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలు, బహిరంగ సభలు సంక్షేమ రంగానికే అత్యంత ప్రాముఖ్యతనిస్తూ హామీలను గుర్తు చేస్తూ ముందుకు సాగుతున్నాయి. అధికార బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలు ఇదే దారిలో పయణిస్తున్నాయి. బీజేపీ ఇంత వరకు మ్యానిఫెస్టో విడుదల చేయకపోయినా వారి ప్రాధాన్యత సంక్షేమానికేనని ఆపార్టీ పెద్దలు ఇప్పటికే ప్రకటించారు.

**ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్..**

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ఇప్పటికే మ్యానిఫెస్టోను ప్రకటించింది. అవేకాకుండా వివిధ పేర్లతో డిక్లరేషన్లను ప్రకటించింది. మహాలక్ష్మి పేరిట ప్రతీ మహిళకు రూ. 2500, రూ. 500లకు గ్యాస్ సిలిండర్, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు భరోసా పథకం పేరుతో ఏడాదికి ఎకరాకు రూ. 15వేలు, వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు, వరి పంట బోనస్ రూ. 500, అన్ని కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లకు రూ. 5లక్షలు, విద్యార్థులకు రూ. 5లక్షల వరకు వడ్డీలేని రుణాలు, మహిళలకు రూ. 4వేల పింఛన్ వంటివి ప్రధానంగా ప్రకటించింది. ఇక అధికార బీఆర్ఎస్ రైతుబంధు సాయం దశల వారీగా పెంపు,. సామాజిక పింఛన్ల పెంపుదల, రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డుదారుల కుటుంబాలకు రైతు బీమా తరహాలో రూ. 5లక్షల బీమా, మహిళలకు నెలకు రూ. 3వేల సాయం, రూ. 400లకే సిలిండర్, ఆరోగ్య శ్రీ గరిష్ఠ పరిమితి రూ. 15లక్షలకు పెంపుదల, పేదలకు ఇండ్ల స్థలాలు, అగ్రవర్ణ పేదలకు రెసిడెన్షియల్ పాఠశాలలు, అసైన్డ భూములపై అధికారం బదలాయింపు వంటివి చెప్పింది.

అయితే రాష్ట్ర వార్షిక బడ్జెట్ 202324లో 2.90లక్షల కోట్లకు పరిమితమైంది. ఇందులో రూ. 2.58లక్షల కోట్లు అన్ని రకాల రాబడులతో సమకూర్చుకుంటామని సర్కార్ అంచనా వేసింది. 202223లో రాష్ట్ర రాబడుల అంచనా రూ. 2.45 లక్షల కోట్ల రాబడి అంచనాలు వేసుకోగా, ఇందులో రూ. 1.92 లక్షలకే పరిమితమైంది. ఇందులో నుంచి సబ్సిడీలు, వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లకు రూ. 80వేల కోట్లకుపైగా వ్యయం చేశారు. అయితే సంక్షేమానికి, ఇతర రంగాలకు కేటాయింపులు ఇంకా మరో 40శాతం ఉంటాయి. కానీ పార్టీలు ప్రకటించిన హామీలను గమనిస్తే బడ్జెట్ సైజ్ రూ. 3.5 లక్షల కోట్లకు మించాల్సి ఉంటుంది.

**కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పరిశీలిస్తే..**

విద్యార్థుల కోచింగ్ ఫీజుకు రూ.5 లక్షల వరకు సహాయం చేస్తామనే మాట ఎలా అమలు చేస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులకు కూడా ఏటా రూ.5 లక్షల కోచింగ్ ఫీజు లేదు. ఇది ఒక డొల్ల హామీ తప్ప ఇంకేమి కాదనే అభిప్రయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభించిన పథకాలనే బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నదని, అప్పులు పెరిగాయని ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ అవే పథకాలకు మరింత సాయం పెంపును ఎనలిస్టులు విమర్శిస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర బడ్జెట్, రాష్ట్రం చేస్తున్న అప్పులు, ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు నెల మొదటి తేదీనే జీతాలు చెల్లించలేని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులు చెబుతూనే ఉన్నాయని, అయినప్పటికీ బీఆర్ఎస్ కంటే మించి తాము నెలనెలా జనాలకు నగదు ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ పార్టీ బాధ్యతారాహిత్యంగా పేర్కొంటున్న పరిస్థితి నెలకొంది.

**బీఆర్ఎస్ మేనీఫెస్టోపై సర్వత్రా ఆసక్తి..**

తెలంగాణలో కాంగ్రెస్ మ్యానిఫెస్టో చూసిన తర్వాత బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. హామీల విషయంలో గులబీ దళపతి, సీఎం కేసీఆర్ ఆచితూచి వ్యవహరించారని పొలిటికల్అనలిస్టులుచెబుతున్నారు.సీఎం బ్రేక్ఫాస్ట్ పథకం, ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ పెంపుదల, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంలాంటివన్నీ ఇప్పటికే ఆచరణలోకి వచ్చాయని గుర్తు చేస్తున్నారు. రైతుబంధు, పెన్షన్లను దశలవారీగా రాబడిని చూసుకొని పెంచుతామని ఇచ్చిన హామీని ఆర్థిక నిపుణులు స్వాగతిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం కేసీఆర్ ఆచరణ సాధ్యం కాని హామీల జోలికి వెళ్లలేదని, సీఎంగా పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతగా ఓ రకంగా చెప్పాలంటే కాస్త బాధ్యతగానే వ్యవహరించారని అభిప్రాయపడుతున్నారు. దశలవారీగా పెన్షన్లు పెంచుతామని చెప్పారు. అంటే వచ్చే ఎన్నికల నాటికి సామాజిక పెన్షన్లు తలా ఒక్కరికి రూ. 5వేలకు చేరుతాయి. కానీ కాంగ్రెస్ మాత్రం గెలవగానే రూ. 4వేలు వేలు ఇస్తామని చెబుతోంది. ఇక లబ్ధిదారులు ఎవరికి ఓటేస్తారో చూడాలి. బీఆర్ఎస్ కన్నా మిన్నగా సంక్షేమ పథకాలని అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. విభిన్న వర్గాలకు నగదు మొత్తాలను నజరానాగా ప్రకటించారు. తాము ఇచ్చే హామీల అమలుకు ఎన్ని వేల కోట్ల వ్యయం అవుతుందో, ఎలా సమీకరిస్తామో చెప్పడంలేదు. దీంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరి హామీలు నమ్మడానికి జనాలు సిద్ధంగా లేరని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అంతేగాక ఇదేవిధమైన హామీలను వారు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఎందుకు అమలు చేయడం లేదనే బీఆర్ఎస్ నేతల ప్రశ్నలకు ప్రజలనుంచి సంపూర్ణ మద్దతు వస్తోంది.

## పేలుళ్ల కేసులో 11 మంది నిందితులకు పదేళ్ల జైలు..

- ఢిల్లీ ఎన్ఐఏ స్పెషల్ కోర్టు తీర్పు

హైదరాబాద్, ఆంధ్రప్రభ బ్యూరో

జాతీయ స్థాయిలో పెను సంచలనం సృష్టించిన హైదరాబాద్ పేలుళ్ల కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టు నిందితులకు శిక్షలు ఖరారు చేసింది. మొత్తం 11 మంది నిందితులకు పదేళ్ల చొప్పున శిక్ష విధిస్తూ ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్ట్ తుది తీర్పును ఇచ్చింది. ఈ కుట్ర వెనుక కీలక సూత్రధారి ఉబెర్ ఉర్ రెహమాన్‌తో పాటు మరో 10 మందికి న్యాయస్థానం శిక్ష వేసింది. హైదరాబాద్‌లో పేలుళ్లు జరిపి విధ్వంసం సృష్టించాలని ప్రయత్నించిన ఈ గ్యాంగ్.. పాకిస్తాన్ నుంచి పేలుడు పదార్థాలు తీసు కొచ్చింది. అయితే దీనిని ముందే పసిగట్టిన తెలంగాణ పోలీసులు వీరి కుట్రను భగ్నం చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిందితులందరు ప్రస్తుతం రిమాండ్ ఖైదీలుగా జైలులో ఉన్నారు.అయితే, ముజాహిద్దీన్ కుట్రగా ఈ కేసు ప్రాచుర్యం పొందింది. ఇప్పటికే ఈ కేసులో సయ్యద్ ముక్బుల్‌ను సెప్టెంబర్ 22వ తేదీన ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు దోషిగా ప్రక టించిం ది. ఇక, ఈ కేసులో ఐదవ నిందితుడిగా ముక్బుల్ ఉన్నాడు. నాందేడ్‌కు చెందిన ముక్బుల్‌ను ఉగ్ర కదలికల నేపథ్యంలో ఫిబ్రవరి 28 న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్ ఉగ్ర సంస్థ ముజాహిద్దీన్‌లోని కీలక సభ్యులతో ముక్బుల్ దగ్గరి సంబంధాలున్నట్లు ఎన్ఐఏ అధికారుల దర్యాప్తులో వెల్లడైంది.

## కన్నకొడుకుని కిరాతకంగా హత్య చేసిన తండ్రి..

**వెన్నులో వణుకు పుట్టించే సంఘటన**

కర్నూల్, ప్రభ న్యూస్

ఈ మధ్య కాలంలో నేరాలు మరీ మితిమీరుతున్నాయి. చిన్న చిన్న విషయాలకు కూడా కొందరు హత్యలు చేస్తున్నారు. మరికొందరు రక్త సంబంధం అని కూడా మరిచి కౄరంగా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి ఘటన ఒకటీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. ఏపీలోని నంద్యాల జిల్లా వెలుగోడు పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. వెలుగోడు పట్టణం సిపి నగర్ లో నివాసముంటున్న సిరివేరు రామకృష్ణ తనయుడు సిరివేరు శ్రీనివాసులు చెడు వ్యసనాలకు, చెడు తిరుగుళ్లకు అలవాటు పడి నిత్యం మద్యం సేవించి వచ్చి తన తండ్రితో గొడవపడేవాడు. కొడుకుకు ఎన్నిసార్లు నచ్చచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ.. తనలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన తండ్రి.. నిన్న రాత్రి మద్యం సేవించి గొడవకు దిగిన కొడుకు శ్రీనివాసు పై కన్న మమకారాన్ని చంపుకొని కందువాతో గొంతు నిమిలి హత మార్చాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## భువనేశ్వరి పరామర్శ.. నేడు ఆఖరు!



**రేణిగుంట (ప్రభ న్యూస్):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఎర్రమరెడ్డిపాలెంలోని సూరా మునిరత్నమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మండలంలోని ఎర్రమరెడ్డి పాలెం గ్రామంలోని సూరా మునిరత్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సూరా మునిరత్నమ్మ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జాతీయ నాయకులు రవి, శ్రీధర్ వర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ప్రముఖ న్యాయవాది ఉదయ్ కుమార్ రెడ్డి, వెంకటాపురం మాజీ ఎంపీటీసీ గజేంద్ర రెడ్డి, మండల ఎస్సీ ఎస్టీ సెల్ నాయకులు నెల్లూరు సుబ్రమణ్యం, కొరియర్ రవి, మాజీ ఎంపీటీసీ బుజ్జి నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## నెలాఖరు నుంచి పత్తి కొనుగోళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ :

రాష్ట్ర వ్యాప్తంగా ముమ్మరంగా పత్తి ఏరివేత పనులు సాగుతుండడంతో ఈ నెలాఖరు నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 350 కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా పత్తికి మద్దతు ధర రూ.7,020గా ఉంది. ఈ ధర దక్కాలంటే పత్తిలో తేమ 8శాతం మాత్రమే ఉండాలని, అయితే 1617శాతం తేమ ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యాపారులు రూ.6,800 నుంచి రూ.7 వేలకు క్వింటా పత్తిని కొనుగోలు చేస్తున్నారని అధికారులు తెలిపారు. ఇప్పటికే నల్లగొండ జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లకు పత్తి రాక మొదలైంది. మరో 1015 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పత్తి కోతకు రానుంది. ఆ సమయంలో ధరలు పడిపోయి రైతులకు నష్టం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ చెబుతోంది. బహిరంగ మార్కెట్‌లో పత్తి ధరలు పడిపోతే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 44.77 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని, దాదాపు 40 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు.



## నిర్మల్ జిల్లాలో బీజేపీకి పెద్ద ఎదురు దెబ్బ

**పార్టీ అధ్యక్షురాలు రమాదేవి రాజీనామా**

**నిర్మల్ ప్రతినిధి** : నిర్మల్ జిల్లా బిజెపి అధ్యక్షురాలు పడకండి రమాదేవి ఆ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించింది. పలువురు అసంతృప్తిగా ఉన్న వారిని రాజీనామా విషయం వారి ఇష్టానికి వదిలేస్తున్నానని, నా స్వార్థం కోసం ఎవరిని రాజీనామా చేయండి అంటూ అనను అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పదేళ్లు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న చివరకు పార్టీ నాకు అన్యాయం చేసిందని, నిన్నకాక మొన్న వచ్చిన వాళ్ళకి భాజపా టికెట్ కేటాయించడం బీజేపీ నైతికత ను మార్చిందని అనడానికి నిదర్శనమని అన్నారు. నాపై డబ్బులు తీసుకున్నానంటూ అబండాలు మోపుతూ ప్రచారం జరుపుతున్నారని అలాంటి ప్రచారాలలో ఏలాంటి వాస్తవం లేదని అన్నారు. భవిష్యత్తులో తన రాజకీయ నిర్ణయాన్ని త్వరలోనే ప్రకటిస్తానని అన్నారు.

## కాంగ్రెస్‌ను బంగళాఖాతంలో కలిపేయండి

### రైతుబంధు వద్దు.. కరెంట్ కట్ ముద్దు అంటున్న కాంగ్రెస్ : కేసీఆర్

మహబూబాబాద్: బిఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉండటం వల్లే 60 ఏళ్లలో కనిపించని అభివృద్ధిని పదేళ్లలో చేయగలిగామని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు.. ఒక వైపు సంక్షేమ కార్యక్రమాలు , మరోవైపు అభివృద్ధి పనులు సమతూకంగా ప్రజాశీర్వాదంతో చేస్తున్నామని చెప్పారు.. అన్ని వర్గాల ప్రజలకు పలు సంక్షేమ పథకాలను అందిస్తున్న పార్టీ తమదని అన్నారు.. మహబూబాబాద్ లో శుక్రవారంనాడు జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రసంగిస్తూ, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు కష్టాలు తప్ప, సంక్షేమం ఉండదని తెలంగాణ సీఎం కేసీఆర్ చెప్పారు.కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ రైతాంగానికి ఐదు గంటల కంటే ఎక్కువ సేపు విద్యుత్ ను సరఫరా చేయడం లేదన్నారు. కర్ణాటక రైతులు తెలంగాణకు వచ్చి ఆందోళనలు నిర్వహించిన విషయాన్ని కేసీఆర్ గుర్తు చేశారు.

తెలంగాణ వచ్చింది కాబట్టే మహబూబాబాద్ జిల్లా అయిందన్నారు. మారుమూల ప్రాంతమైనా పట్టుబట్టి జిల్లాగా ఏర్పాటు చేసిన విషయాన్ని కేసీఆర్ చెప్పారు. సమైక్య రాష్ట్రంలో మన ఓట్లు తీసుకొని మన బాధలు పట్టించుకోలేదన్నారు. గిరిజన ప్రాంతంలో మెడికల్ కాలేజీని కూడ ఏర్పాటు చేసుకున్నామన్నారు. జిల్లాలోని తండాల్లో ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి కలకలలాడుతుందన్నారు. రైతు బంధు అవసరం లేదని మాజీ పీసీసీ ఉత్తమ్ కుమార్ రెడ్డి చెబుతున్నారన్నారు. రైతు బంధు ఉండాలా వద్దా అని ఆయన ప్రశ్నించారు. రైతు బంధు వద్దన్న వారికి బుద్ది చెప్పాలని ఆయన ప్రజలను కోరారు.

తెలంగాణలో రైతాంగానికి వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన గుర్తు చేశారు. మోడీ స్వంత రాష్ట్రం గుజరాత్ లో కూడ వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా కావడం



లేదన్నారు. ధరణిని ఎత్తివేస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారన్నారు. ధరణిని ఎత్తివేస్తే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ధరణి పోర్టల్ తో భూకబ్జాలు తగ్గిపోయాయని కేసీఆర్ చెప్పారు. రైతుల భూమి మీద రైతుకు మాత్రమే అధికారం ఉండాలని ధరణిని తీసుకువచ్చినట్టుగా కేసీఆర్ తెలిపారు. ధరణి లేకపోతే రైతుబంధు, రైతు భీమా ఉండదన్నారు. ధరణిని బంగాళా ఖాతంలో వేస్తామని భట్టి విక్రమార్క చెబుతున్నారన్నారు. ధరణిని వద్దంటున్న కాంగ్రెస్ ను బంగాళాఖాతంలో వేయాలని కేసీఆర్ కోరారు.